# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ ఆదివారం 14 డిసెంబర్ 2025 | www.balagamtv.com | పేజీలు 4


## సంక్రాంతికి ప్రత్యేక రైళ్లకు నేటి నుంచి అడ్వాన్స్ బుకింగ్



బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

సంక్రాంతి పండుగ సందర్భంగా దక్షిణ మధ్య రైల్వే ప్రత్యేక రైళ్లను నడపనుంది. ఈ మేరకు కీలక నిర్ణయం తీసుకుంది. ఆదివారం ఉదయం 8 గంటల నుంచి అడ్వాన్స్ బుకింగ్ ఓపెన్ చేయనుం ది. ప్రయాణికులు ముందస్తు బుకింగ్ చేసుకో వాలని సూచించింది. దాదాపు 33 రైళ్లను సంక్రాం తి నేపథ్యంలో నడుపున్నట్టు సీపీఆర్వో శ్రీధర్ శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఆయా రైళ్లుకాకినాడ, వికారాబాద్, సికింద్రాబాద్, తిరుపతి, లింగంపల్లి, నర్సాపూర్ మధ్య నడుస్తాయని వివరించారు. ఒకటి నుంచి మూడు సర్వీసుల వరకు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు.

# నేడు రెండో విడత ఎన్నికలు



- 3,911 గ్రామాలు, 29,917 వార్డుల్లో ఎన్నికలు
- 415 గ్రామాలు ఏకగ్రీవం
- 3,769 పోలింగ్ స్టేషన్లలో వెబ్ కాస్టింగ్.. రూరల్ ఏరియాల్లో వీడియోగ్రఫీ
- అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఏర్పాట్లు
- రూ.8,59,39,828 నగదు సీజ్, 33.262 మంది బైండోవర్

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా పంచాయతీల్లో నేడు రెండో విడత పోరు జరగనుంది. రెండో విడత పంచాయతీ ఎన్నికల నిర్వహణకు అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. 193 మండలాల్లోని 3,911 పంచాయతీల్లో జరగనున్న సర్పంచ్ ఎన్నికలకు, సర్వం సిద్ధం చేసినట్టు ఎన్నికల సంఘం శనివార ప్రకటనలో తెలిపింది. సర్పంచ్ స్థానాలకు 12,782 మంది, వార్డు స్థానాలకు 71,071 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. ఆదివారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్, ఆ తర్వాత మధ్యాహ్నం 2 గంటల నుంచి కౌంటింగ్ నిర్వహించనున్నారు. సాయంత్రం ఉప సర్పంచ్ ఎన్నిక నిర్వహిస్తారు. వీలు కాకుంటే సోమవారం పూర్తి చేయనున్నారు. ఇప్పటికే అబ్జర్వర్లు, మైక్రో అబ్జర్వర్ల నియామకం జరిగింది. 99 శాతం ఓటర్ స్లిప్ల పంపిణీ, సిబ్బందికి శిక్షణ పూర్తి అయ్యినట్టు పేర్కొంది.

ఎన్నికల కోసం మొత్తం 38,337 పోలింగ్ కేంద్రాలను వినియోగిస్తున్నట్లు అధికారులు తెలిపారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసు శాఖ విస్తృత బందోబస్తు ఏర్పాటు చేసింది. సున్నిత ప్రాంతాల్లో అదనపు బలగాలను మోహరించారు.

**415 గ్రామాల్లో సర్పంచి పదవులు ఏకగ్రీవం**

మొత్తం 4,333 పంచాయతీలకు ఎన్నికలు జరగనుండగా, అందులో 415 గ్రామాల్లో సర్పంచి పదవులు ఏకగ్రీవమయ్యాయి. ఐదు పంచాయతీల్లో సర్పంచి పదవికి నామినేషన్లు దాఖలు కాకపోవడంతో అక్కడ ఎన్నికలు నిర్వహించలేమని ఎన్నికల సంఘం వెల్లడించింది. మిగిలిన 3,911 గ్రామాల్లోని సర్పంచి పదవుల కోసం 12,782 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు.

వార్డు సభ్యుల విషయంలో మొత్తం 38,350 వార్డులు నోటిఫై చేయగా, 108 వార్డులకు నామినేషన్లు దాఖలు కాలేదు. 8,307 వార్డులు ఏకగ్రీవమయ్యాయి. మిగిలిన 29,917 వార్డులకు పోలింగ్ జరగనుండగా, 71,071 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు.

సర్పంచి పదవులకు నామినేషన్లు దాఖలు కాని ఐదు గ్రామాల్లో రెండు నల్గొండ జిల్లాలో, ఒకటి భద్రాద్రి-కొత్తగూడెం జిల్లాలో, ఒకటి మంచిర్యాల జిల్లాలో, మరొకటి వరంగల్ జిల్లాలో ఉన్నట్లు అధికారులు తెలిపారు. వీటిలో రెండు సర్పంచి స్థానాలకు ఎన్నికలు నిర్వహించడం లేదని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది.

**పోలింగ్ సిబ్బందికి సామగ్రి పంపిణీ**

ఆదివారం జరగనున్న పోలింగ్ కోసం అన్ని కేంద్రాలకు ఎన్నికల సామగ్రిని ఇప్పటికే పంపిణీ చేశారు. పోలింగ్ సిబ్బందికి పలు సూచనలు చేసిన ఉన్నతాధికారులు, తొలి విడత మాదిరిగానే ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించాలని ఆదేశించారు. ఓట్ల లెక్కింపు పూర్తయ్యాక ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చిన తర్వాతే ఫలితాలను అధికారికంగా ప్రకటించాలని స్పష్టం చేశారు.

# హైదరాబాద్‌లో మెస్సీ మేనియా





- ఉప్పల్‌లో ఉత్సాహభరితంగా ఎగ్జిబిషన్ మ్యాచ్
- ఫ్రెండ్లీ మ్యాచ్‌లో మెస్సీ జట్టుపై రేవంత్ జట్టు విజయం
- గోల్ కొట్టిన రేవంత్ రెడ్డి
- సింగరేణి ఆర్ఆర్-9 టీమ్ విజయం
- ఇరు జట్లకు ట్రోఫీలు అందజేత
- సందడి చేసిన రేవంత్‌రెడ్డి, రాహుల్‌గాంధీ

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

ఎన్నో రోజులుగా ఉత్కంఠగా ఎదురుచూసిన ప్రపంచ ఫుట్‌బాల్ దిగ్గజం, అర్జెంటినా కెప్టెన్ లియోనెల్ మెస్సీ టూర్ హైదరాబాద్ ఉప్పల్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ స్టేడియం మైదానంలో క్రీడాభిమానులను ఉర్రూతలూగించింది. మెస్సీ స్టేడియంలోకి అడుగుపెట్టడం నుంచి ఆద్యంతం ఆసక్తికరంగా సాగిన ఎగ్జిబిషన్ ఫుట్‌బాల్ మ్యాచ్‌లో సింగరేణి ఆర్ఆర్-9 టీమ్ తరపున ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారు గోల్ సాధించి హైలైట్‌గా నిలిచారు. ఫుట్‌బాల్ దిగ్గజాలు రోడ్రిగో డి పాల్ (అర్జెంటీనా), లూయిస్ సువారెజ్ (ఉరుగ్వే) లతో కలిసి హైదరాబాద్ చేరుకున్న మెస్సీ స్టేడియంలో అడుగుపెట్టినప్పటి నుంచి చివరి వరకు గ్యాలరీలో ఉన్న క్రీడాభిమానులకు అభివాదం చేస్తూ వారిలో జోష్ నింపారు. ప్రారంభంలో సింగరేణి ఆర్ఆర్ 9 టీమ్‌కు, అపర? ఆల్ స్టార్స్ టీమ్‌కు మధ్యన సాగిన ఎగ్జిబిషన్ మ్యాచ్‌ను మెస్సీ ఆసక్తిగా తిలకించారు.

ఉత్తేజంగా సాగిన ఈ మ్యాచ్‌లో సింగరేణి ఆర్ఆర్-9 టీమ్ 4-0 గోల్స్‌తో విజయం సాధించింది. ఆర్ఆర్ టీమ్ తరపున మధ్యలో చేరిన రేవంత్ రెడ్డి గారు నాలుగో గోల్ సాధించినప్పుడు అభిమానులు పెద్ద ఎత్తున కేరింతలు కొట్టారు. అతిధిగా హాజరైన రాహుల్ గాంధీ ఈ మ్యాచ్ జరుగుతున్నంత సేపు గ్యాలరీ నుంచి తిలకించారు. రేవంత్ రెడ్డి గోల్ చేసిన అనంతరం మెస్సీ మైదానంలోకి వచ్చారు. మెస్సీకి స్వాగతంగా క్రీడాభిమానుల హర్షధ్వానాలతో స్టేడియం దద్దరిల్లింది. మొదట ఫుట్‌బాల్ టీమ్‌లకు చెందిన పిల్లలతో మెస్సీ కరచాలనం చేస్తూ సరదాగా గడిపారు. ఎగ్జిబిషన్ ఫుట్‌బాల్ మ్యాచ్ అనంతరం మెస్సీ బృందాల వారిగా ఫుట్‌బాల్ కిక్స్ ఇస్తూ పిల్లలతో ఆడారు.

స్టేడియమంతా కలియతిరుగుతూ క్రీడాభిమానుల్లో జోష్‌ను నింపారు. ఒకచోట కాకుండా స్టేడియం నలుమూల తిరుగుతూ ఫుట్‌బాల్‌ను గ్యాలరీలోకి కిక్ చేస్తూ మిగితా 4వ పేజీలో

## కోల్‌కతా మెస్సీ పర్యటనలో ఉద్రిక్తత

- 10 నిమిషాల్లో స్టేడియం నుంచి మెస్సి వెళ్లిపోయాడని అభిమానుల ఆగ్రహం
- సాల్ట్ లేక్ స్టేడియంలో విధ్వంసం
- కుర్చీలు విసిరేసిన అభిమానులు
- క్షమాపణ చెప్పిన మమత
- నిర్వాహకులు అదుపులోకి

బలగం టీవి, కోల్‌కతా

ప్రముఖ ఫుట్‌బాల్ క్రీడాకారుడు లియోనెల్ మెస్సీ భారత్ పర్యటనలో భాగంగా శనివారం కోల్‌కతాలో పాల్గొన్న కార్యక్రమం అస్తవ్యస్థంగా మారి తీవ్ర గందరగోళానికి దారి తీసింది. సాల్ట్ లేక్ స్టేడియంలో మెస్సీ కేవలం 20 నిమిషాల పాటు మాత్రమే కనిపించడంతో వేలాదిమంది అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్టేడియంలో సీసాలు, కుర్చీలు విసిరేసి విధ్వంసానికి పాల్పడ్డారు. దీంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

తమ అభిమాన క్రీడాకారుడిని కాసేపైనా చూడాలనే ఆశతో అధిక ధరలకు టిక్కెట్లు కొనుగోలు చేసిన అభిమానులు నిరాశకు గురయ్యారు. ఉదయం 11.30 గంటల సమయంలో మెస్సీ కాన్వాయ్ స్టేడియంలోకి ప్రవేశించింది. మెస్సీతో పాటు ఫుట్‌బాలర్లు లూయిస్ సారెజ్, రోడ్రిగో డీ పాల్ కూడా ఉన్నారు. కోల్‌కతాతో పాటు దేశంలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన అభిమానులతో స్టేడియం కిక్కిరిసిపోయింది. మెస్సీ స్టేడియంలో అడుగుపెట్టగానే మిగితా 4వ పేజీలో

# నక్సలిజంతో ఎవరికీ ప్రయోజనం లేదు

- శాంతి మార్గమే అభివృద్ధికి బాట
- 2026 మార్చి 31లోగా నక్సలిజం నిర్మూలన లక్ష్యం
- కేంద్ర హెూం మంత్రి అమిత్ షా



బలగం టీవి, జగదల్‌పూర్

నక్సలిజం వల్ల ఎవరికీ ప్రయోజనం ఉండదని కేంద్ర హెూం మంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. మావోయిస్టులుగా మారి ఆయుధాలు చేపట్టినవారికైనా, వారిని ఎదుర్కొనే భద్రతా బలగాలకైనా నక్సలిజం ద్వారా లాభం లేదని చెప్పారు. శాంతి మార్గమే దేశాభివృద్ధికి సరైన దారిగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. శనివారం ఛత్తీస్‌గఢ్‌లోని జగదల్‌పూర్ ప్రియదర్శిని స్టేడియంలో నిర్వహించిన బస్తర్ ఒలింపిక్స్ 2025 ముగింపు వేడుకల్లో అమిత్ షా ప్రసంగించారు. నక్సలిజం అనే విషసర్పమే బస్తర్ ప్రాంతంలో అభివృద్ధిని ఎన్నేళ్లుగా అడ్డుకుంటోందని ఆయన వ్యాఖ్యానించారు. నక్సలిజం పూర్తిగా అంతమయ్యే రోజున ఈ ప్రాంతంలో అభివృద్ధికి నూతన అధ్యాయం ప్రారంభమవుతుందని చెప్పారు.

2026 మార్చి 31 నాటికి నక్సలిజాన్ని పూర్తిగా అంతం చేయాలనే లక్ష్యాన్ని ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిందని అమిత్ షా తెలిపారు. ఏడు జిల్లాలతో కూడిన బస్తర్ డివిజన్‌ను రాబోయే ఐదేళ్లలో దేశంలోనే అత్యంత అభివృద్ధి చెందిన గిరిజన ప్రాంతంగా మార్చేందుకు కేంద్రం కట్టుబడి ఉందన్నారు. ఇంకా మావోయిస్టుల్లో ఉన్నవారు జనజీవన స్రవంతిలోకి తిరిగి రావాలని పిలుపునిచ్చారు. ఆయుధాలు వదిలేసిన వారికి మెరుగైన పునరావాస ప్యాకేజీలు అందిస్తున్నామని తెలిపారు.

**2026లోనూ జగదల్‌పూర్‌కు వస్తా**

తాను 2024లో జరిగిన బస్తర్ ఒలింపిక్స్ ముగింపు వేడుకలకు హాజరైనట్లు గుర్తు చేశారు. 2026లో జరిగే వేడుకలకు కూడా తప్పకుండా వస్తానని హామీ ఇచ్చారు. ఆ సమయానికి ఛత్తీస్‌గఢ్‌తో పాటు యావత్ దేశంలో నక్సలిజాన్ని తుదముట్టిస్తామని చెప్పారు. బస్తర్ డివిజన్‌లోని కాంకేర్, కొండగావ్, బస్తర్, సుక్మా, బీజాపూర్, నారాయణ్‌పూర్, దంతెవాడ జిల్లాలను 2030 డిసెంబరు నాటికి దేశంలోనే అత్యంత వికసిత గిరిజన జిల్లాలుగా తీర్చిదిద్దుతామని ప్రకటించారు. ఇళ్లు, విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్లు, ఎల్‌పీజీ కనెక్షన్లు, రోడ్లు, ప్రతి ఐదు కిలోమీటర్లకు ఒక బ్యాంకు, ఆస్పత్రులు, ఉచిత ఆహార ధాన్యాలు, ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల ఉచిత వైద్యం అందిస్తామని తెలిపారు. బస్తర్ స్వరూపం మారుతోందని అమిత్ షా అన్నారు. ఒకప్పుడు తుపాకీ చప్పుళ్లు వినిపించిన పల్లెల్లో నేడు స్కూలు బెల్స్ మోగుతున్నాయని చెప్పారు. రోడ్లు, రైల్వే, హైవే ప్రాజెక్టులు వేగంగా సాగుతున్నాయని తెలిపారు. 'లాల్ సలామ్' స్థానంలో 'భారత్ మాతా కీ జై' నినాదాలు వినిపిస్తున్నాయని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆపరేషన్లు మంచి ఫలితాలు ఇస్తున్నాయని చెప్పారు. మిగితా 4వ పేజీలో

## ఇది విజన్ 2047 కాదు.. విద్యార్థుల పాలిట పాయిజన్ 2047..



- యాడ్లలో తెలంగాణ రైసింగ్ .. హాస్పిటల్స్ లో విద్యార్థులు ఫాలింగ్..
- మెస్సితో ఫుట్ బాల్ ఆడేందుకు మేస్త్రి కోట్లు ఖర్చు చేస్తున్నాడు..
- పిల్లలకు మాత్రం తిండి పెట్టడం లేదు..
- కలుషిత ఆహారంతో విద్యార్థులు అస్వస్థత
- మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు
- కింగ్ కోఠి ఆసుపత్రిలో విద్యార్థులను పరామర్శించిన హరీష్ రావు.

బలగం టీవీ, హైదరాబాద్

బాగ్ లింగంపల్లి మైనార్టీ గురుకుల పాఠశాలలో కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురైన విద్యార్థులను మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు హరీష్ రావు కింగ్ కోఠి ప్రభుత్వ ఆసుపత్రిలో పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితి గురించి డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. ఈ పరామర్శలో ఆయన వెంట బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేష్, ముఠా గోపాల్ ఉన్నారు. అనంతరం హరీష్ రావు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై, కాంగ్రెస్ నాయకులు రాహుల్ గాంధీ పర్యటనపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు.

ఈ సందర్భంగా మాజీ మంత్రి హరీష్‌రావు మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి డబ్బా మిగితా 4వ పేజీలో

## గురుకుల హాస్టల్ డిప్యూటీ వార్డెన్, ప్రిన్సిపాల్, స్టాఫ్ నర్స్ సస్పెండ్

- మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి మొహమ్మద్ అజారుద్దీన్
- కింగ్ కోఠి ఆసుపత్రిలో విద్యార్థులను మంత్రి పరామర్శ

వివరాలు 4వ పేజీలో

## బాధిత ప్రయాణికులకు ఇండిగో రూ.500 కోట్ల పరిహారం

బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో

దేశీయ ప్రముఖ విమానయాన సంస్థ ఇండిగో కీలక ప్రకటన చేసింది. ఇటీవలి విమానాల రద్దు, ఆలస్యం కారణంగా తీవ్ర ఇబ్బం దులు ఎదుర్కొన్న ప్రయాణికులకు ఊరట కల్పిస్తూ నిర్ణయం తీసుకున్నది. సంక్షోభంతో ఇబ్బందిపడిన ప్రయాణికులకు పరిహారం అందించనున్నట్టు ప్రకటించింది. ఈ మేరకు ఎక్స్ వేదికగా ప్రకటన విడుదల చేసింది. బాధితులకు చెల్లించాల్సిన నష్టప రిహారం మొత్తం రూ.500 కోట్లు దాటుతుందని అంచనా వేసింది. విమానం బయలుదేరడానికి 24 గంటల ముందు రద్దయిన సర్వీసుల ప్రయాణికులకు, కొన్ని విమానాశ్రయాల్లో తీవ్రంగా చిక్కుకు పోయిన వారికి ఈ పరిహారం అందించనున్నట్టు కంపెనీ పేర్కొన్నది. నష్టపరిహారం అందించే ప్రక్రియను వీలైనంత పారదర్శకంగా, సులభంగా పూర్తి చేయడమే తమ లక్ష్యమని

## మంత్రాలు నెపంతో వ్యక్తి హత్య

- అడవిలోకి తీసుకెళ్లి కర్రలతో కొట్టి హత్య
- అనంతరం కాల్చి బూడిద

బలగం టీవీ, నిర్మల్

నిర్మల్ జిల్లా కడెం మండలంలోని ఉడుంపూర్ గ్రామ పంచాయితీ పరిధి గండి గోపాల్పూర్‌కు చెందిన దేశినేని భీమయ్య (55)ను అదే గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు హత్య చేసి కాల్చి బూడిద చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ నెల 10వ తేదీన ఈ ఘోర ఘటన చోటుచేసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు.

పోలీసుల వివరాల ప్రకారం, భీమయ్య మంత్రాలు చేస్తున్నాడన్న అనుమానంతో నిందితులు అతడిని ఊరి చివర సమీపంలోని అటవీ ప్రాంతానికి తీసుకెళ్లారు. అక్కడ కర్రలతో దాడి చేసి హత్య చేసిన అనంతరం మృతదేహాన్ని కాల్చి బూడిద చేసినట్లు తెలిపారు. ఘటన అనంతరం విషయం బయటకు రాకపోవడంతో ఆలస్యంగా వెలుగుచూసింది. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఖానాపూర్ సీఐ అజయ్ బాబు, కడెం ఎస్సై సాయికిరణ్ తెలిపారు. నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. ఘటనకు సంబంధించిన అన్ని కోణాల్లో విచారణ కొనసాగుతోందని పోలీసులు తెలిపారు.

## అసంఘిటిత కార్మికుల మాదిరిగా సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల పరిస్థితి



బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల పరిస్థితి చూస్తే అంతా భేషుగ్గానే కనబడుతోందని హైకోర్టు పేర్కొంది. వాస్తవ పరిస్థితి అందుకు భిన్నంగా ఉందని అభిప్రాయపడింది. వారి దుస్థితి అసంఘిటిత కార్మికుల మాదిరిగా వారి దుస్థితి ఉందని తెలిపింది. భారీ జీతభత్యాలు, ఆకర్షణీయమైన సౌకర్యాలు, విలాసవంతమైన వసతులు ఉన్నప్పటికీ వాళ్ల ఉద్యోగాలకు భద్రత లేకుండా పోయిందని పేర్కొంది. దేశ ఆర్థిక పురోగతిలో కీలకపాత్ర పోషిస్తున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల శక్తి సామర్థ్యాలను అతిగా వినియోగించుకోవడం వల్ల 60 ఏండ్లకు రావాల్సిన అనారోగ్య సమస్యలు 30 ఏండ్లకే వస్తున్నాయని గుర్తు చేసింది. ఐటీ, హెల్త్ బీమాలను ఏండ్ల తరబడి చెల్లించిన వాళ్లకు చివరికి అవి లేకుండా పోతున్నాయని చెప్పింది. సాఫ్ట్‌వేర్ ఉద్యోగులకు సామాజిక భద్రత, ఆరోగ్య భద్రతల కోసం చట్టాలు చేయాల్సిన అవసరముందని గుర్తు చేసింది. జీవన విధానానికి విరుద్ధంగా విధులను నిర్వహించే వారి కోసం చట్టాలను చేయాలని ప్రభుత్వాలకు సూచించింది. అగ్రిమెంట్ షరతులకు విరుద్ధంగా రాజీనామా చేస్తున్నందుకు రూ. 5.9లక్షల పరిహారం చెల్లించాలని ఐటీ కంపెనీ డిమాండ్ చేయడంపై కార్మిక శాఖకు ఫిర్యాదు చేసే చర్యలు లేవంటూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి రాజేశ్ వేసిన పిటిషన్‌పై జస్టిస్ నగేశ్ బీమపాక పైవిధంగా స్పందించారు. కాంట్రాక్ట్ చట్టంలోని సెక్షన్ 27 ప్రకారం ఒక వ్యక్తిని చట్టబద్ధమైన వృత్తి, వ్యాపారం, వాణిజ్యం చేపట్ట కుండా నిరోధించేందుకు వీల్లేదన్నారు. పిటిషనర్ 2019లో ఉద్యోగంలో చేరినప్పుడు అగ్రిమెంట్ పేపర్‌పై సంతకం చేశారని తెలిపారు. 2022 వరకు ఉద్యోగం చేశారని, అందుకు అనుగుణంగా అగ్రిమెంట్‌ను పెంచారని తప్పుపట్టారు. దీనిపై కార్మిక శాఖ చట్టాలను అమలు గురించి చర్యలు తీసుకోవాలన్నారు. విజయ బ్యాంక్ వర్సెస్ ప్రశాంత్ బి.నర్నవారే కేసులో సుప్రీం కోర్టు తీర్పును ప్రస్తావించారు. ఈ కేసులో పిటిషనర్ చెల్లించాలన్న పరిహారాన్ని కంపెనీ ఏ ప్రాతిపదికన నిర్ణయించిందో, తెల్చాలని కార్మిక శాఖను ఆదేశించారు. పిటిషనర్ రాజీనామాను ఆమోదించాలంటూ కంపెనీని ఆదేశించారు. ఉద్యోగుల సామాజిక భద్రతపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. పాలకులు ఆ ఉద్యోగులపై అధ్యయనం చేయాలని సూచించారు. వారి హక్కుల రక్షణ కోసం చట్టాలు చేయాలని సూచించారు. చట్టబద్ధ ఆరోగ్య రక్షణ, ఏకపక్షంగా ఉద్యోగులను తొలగించడంపై ప్రభుత్వాలు చట్టాలను చేయాలన్నారు. విదేశీ మారక ద్రవ్యానికి తోడ్పడుతున్న మధ్యతరగతి పన్ను చెల్లింపుదారులకు సామాజిక భద్రత కల్పన ఎంతో అవసరమని చెప్పారు. కాంట్రాక్టు చట్టంలోని సెక్షన్ 27 ప్రకారం అగ్రిమెంట్ అమలుకు వీల్లేదని తెలిపారు. 2019లో పిటిషనర్ విధుల్లో చేరారు. 2022 వరకు పని చేశారు. ఎప్పటికప్పుడు అగ్రిమెంట్‌ను పెంచుకుంటూ చట్ట నిబంధనలను తప్పించుకునే ప్రయత్నం కంపెనీ చేసిందని పేర్కొన్నారు. ఐటీ కంపెనీలను కార్మిక చట్టాలను అమలు చేస్తున్నాయో, లేదో కార్మిక శాఖ ఆఫీసర్లు సమీక్షించి చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కేసులో కంపెనీ ఏ ప్రాతిపదికన కంపెనీ పరిహారం నిర్ణయించిందో, తేల్చాలని కార్మికశాఖను ఆదేశించారు. పిటిషనర్ రాజీనామాను ఆమోదించాలని ఐటీ కంపెనీని ఆదేశించారు.

## పోగు బంధంతో ఫోన్ బంధం..

- సిరిసిల్ల నేతన్న అద్భుత సృష్టి.. క్యూఆర్ కోడ్ శాలువాను ఆవిష్కరించిన కేటీఆర్
- తెలంగాణ చరిత్ర, సంస్కృతి, అభివృద్ధి కళ్ళకు కట్టేలా వినూత్న శాలువా
- 15 రోజులు శ్రమించి అద్భుతాన్ని ఆవిష్కరించిన నేతన్న నల్ల విజయ్ కుమార్



బలగం టీవీ, హైదరాబాద్:

సిరిసిల్ల నేతన్నల నైపుణ్యం మరోసారి ప్రపంచానికి తెలిసింది. సాంకేతికతను, మగ్గాన్ని జోడించి సిరిసిల్లకు చెందిన ప్రముఖ నేతన్న నల్ల విజయ్ కుమార్ రూపొందించిన 'క్యూఆర్ కోడ్' శాలువాను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఈరోజు తన నంది నగర్ నివాసంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విజయ్ కుమార్ ప్రతిభను కేటీఆర్ ప్రత్యేకంగా అభినందించారు.

**శాలువా ప్రత్యేకతలు**

"పోగు బంధంతో ఫోన్ బంధం" అనే కాన్సెప్ట్‌తో ఈ శాలువాను రూపొందించారు. శాలువాపై నేసిన క్యూఆర్ కోడ్‌ను మొబైల్ ఫోన్‌తో స్కాన్ చేయగానే తెలంగాణ చరిత్ర, సంస్కృతి, ప్రముఖ దేవాలయాలు, చారిత్రక కట్టడాలు మనకు కనిపిస్తాయి. అంతేకాకుండా, కేసీఆర్ హయాంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మిషన్ భగీరథ, కాళేశ్వరం ప్రాజెక్టుల గొప్పతనాన్ని, యాదాద్రి ఆలయ వైభవాన్ని తెలిపేలా ఈ కోడ్‌ను తీర్చిదిద్దారు. కేవలం 15 రోజుల వ్యవధిలో ఇంతటి అద్భుతమైన శాలువాను విజయ్ కుమార్ రూపొందించడం విశేషం. ఈ శాలువాపై నేసిన క్యూఆర్ కోడ్‌ను మొబైల్ ఫోన్‌తో స్కాన్ చేయగానే తెలంగాణ చరిత్ర, సంస్కృతి, ప్రముఖ దేవాలయాలు, చారిత్రక కట్టడాలు మనకు కనిపిస్తాయి.

నేతన్న నల్ల విజయ్ కుమార్ మాట్లాడుతూ.. "మా నాన్న గతంలో అగ్గిపెట్టెలో పట్టే చీరను తయారు చేశారు. ఆయనే నాకు స్ఫూర్తి. గతంలో నేను రంగులు మారే చీరను, అగ్గిపెట్టెలో పట్టే చీరను తయారు చేసినప్పుడు, అప్పటి సీఎం కేసీఆర్ చేతుల మీదుగా ఉగాది పురస్కారం అందుకోవడం నా అదృష్టం. కేసీఆర్ తెలంగాణకు చేసిన అభివృద్ధిని, మన వారసత్వ సంపదను మిగితా 4వ పేజీలో



## పార్లమెంటుపై దాడిలో మృతులకు నివాళులు

**పాల్గొన్న ఉపరాష్ట్రపతి, మోడీ, రాహుల్**

బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో

2001లో పార్లమెంటుపై జరిగిన దాడిలో మృతి చెందిన వారికి పార్లమెంటు భవనంలో ప్రధాని మోడీ, ఉపరాష్ట్రపతి సి.పి రాధాకృష్ణన్, లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీ ఛైర్‌పర్సన్ సోనియాగాంధీ, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజుతో పాటు పలవురు సీనియర్ పార్లమెంటు సభ్యులు నివాళులర్పించారు. వారి ధైర్యసాహసాలను, త్యాగాలను గుర్తు చేసుకున్నారు. ఒక పౌరుడితో సహా 14 మంది మిగితా 4వ పేజీలో

# అర్హులందరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి..



- మూడో ఫేజ్ ఎన్నికలు ముగిసే వరకూ మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలులో ఉంటుంది..
- ఇల్లంతకుంట డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో పరిశీలన..
- ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

గ్రామ పంచాయతీ ఎన్నికల్లో అర్హులందరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ పిలుపు ఇచ్చారు. బోయినపల్లి, ఇల్లంతకుంట, తంగళ్ళపల్లి మండలాల్లో రెండో ఫేజ్ ఎన్నికలు నిర్వహించనున్న సందర్భంగా ఇల్లంతకుంట జూనియర్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని శనివారం ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్, జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు రవి కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడారు.

బోయినపల్లి, ఇల్లంతకుంట, తంగళ్ళపల్లి మండలాల్లో ఈ నెల 14 వ తేదీన ఆదివారం 77 గ్రామ పంచాయతీల్లో సర్పంచ్ స్థానాలకు, 530 వార్డుల్లో ఎన్నికలు నిర్వహించ నున్నారని వివరించారు. మూడు మండలాల్లో కలిపి మొత్తం ప్రిసైడింగ్ అధికారులు 910, ఓపీఓలు 1093 మంది విధులు నిర్వర్తించనున్నారని తెలిపారు. ఎస్ ఈ సీ నిబంధనల ప్రకారం విధులు నిర్వర్తించాలని సూచించారు. బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పేపర్లు, ఇంక ఇతర సామగ్రి సరిచూసుకోవాలని సూచించారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుంచి పోలింగ్ కేంద్రాలకు కేటాయించిన వాహనాల్లోనే ఎన్నికల సామగ్రి తరలించాలని స్పష్టం చేశారు. ఓట్ల లెక్కింపు, పోస్టల్ బ్యాలెట్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్తున్న అధికారులు, సిబ్బందితో మాట్లాడారు. ఓటర్లు అందరూ తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. ఎన్నికలు నిష్పక్షపాతంగా, స్వేచ్ఛగా నిర్వహిస్తామని స్పష్టం చేశారు. మూడో ఫేజ్ ఎన్నికలు ముగిసే వరకూ మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలులో ఉంటుందని ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ తెలిపారు. ఈ పరిశీలనలో ఏఎస్పీ చంద్రయ్య, సిరిసిల్ల ఆర్డీఓ వెంకటేశ్వర్లు, జడ్పీ డిప్యూటీ సీఈవో గీత, జిల్లా సహకార అధికారి రామకృష?, నోడల్ అధికారి భారతి, తహసీల్దార్ ఫరూఖ్, ఎంపీడీఓ శశికళ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గురుకులాల్లో ఫుడ్ పాయిజన్ వరుస ఘటనలు..




- గురుకులాల్లో విషాహారం
- కంచర్ల రవి గౌడ్ ఆగ్రహం

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

రాష్ట్రవ్యాప్తంగా గురుకుల పాఠశాలల్లో విద్యార్థులు ఫుడ్ పాయిజన్‌కు గురవుతున్న వరుస ఘటనలపై బీఆర్ఎస్ నేత కంచర్ల రవి గౌడ్ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రభుత్వ నిర్లక్ష్యమే ఈ దురెటనలకు కారణమని ఆయన ఆరోపించారు.శనివారం సిరిసిల్లలోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో కంచర్ల రవి గౌడ్ మాట్లాడుతూ.. హైదరాబాద్‌లోని బాగ్‌లింగంపల్లి గురుకులంలో 22 మంది విద్యార్థులు, చంద్ర నాయక్ తండ పాఠశాలలో 44 మంది విద్యార్థులు ఫుడ్ పాయిజన్‌కు గురై ఆస్పత్రుల పాలైన విషయాన్ని ప్రస్తావించారు. ఈ ఘటనలు యాద ృచ్ఛికం కావు, కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యానికి ప్రత్యక్ష సాక్ష్యాలు అని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి గురుకులాలు 'విషాహార కేంద్రాలుగా' మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. వరుస ఘటనల్లో పేద విద్యార్థులు ప్రాణాలు కోల్పోతున్నా, ప్రభుత్వం మాత్రం నిమ్మకాయ నీళ్లు తాగినట్టు మౌనం వహిస్తోందని మండిపడ్డారు. విద్యార్థుల ప్రాణాల కంటే ఈ ప్రభుత్వానికి ఇంకేమైనా ముఖ్యమా అని ప్రశ్నించారు. ఫుడ్ పాయిజన్ ఎందుకు జరుగుతోందన్న దానిపై ఒక్క సమీక్ష సమావేశం కూడా నిర్వహించని ముఖ్యమంత్రి వైఖరి సిగ్గుచేటని తీవ్ర విమర్శలు చేశారు.

తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో గురుకుల వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందని గుర్తుచేశారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక గురుకులాలు అస్తవ్యస్తానికి, అవినీతికి, నిర్లక్ష్యానికి బలవుతున్నాయని ఆరోపించారు. పేద పిల్లలను కంటికి రెప్పలా కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, కానీ నేడు అదే ప్రభుత్వం విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇకనైనా మేల్కొని గురుకులాల్లో నాణ్యమైన ఆహారం సరఫరా చేయాలని, కఠినమైన తనిఖీలు చేపట్టాలని, బాధ్యులపై తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్? చేశారు. లేదంటే, బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు ఉద్ధ ృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. పేద విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడితే ఊరుకునేది లేదని, రోడ్డెక్కి పోరాడతామని కంచర్ల రవి గౌడ్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అరికెల వినయ్, కళ్యాణపు వినయ్, సామల శ్రీకర్, మేడిశెట్టి యశ్వంత్, కొండ వర్షిత్, కంకణాల సాయి తేజ, మహమ్మద్, మాగంటి కిరణ్ తదితర నాయకులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పటిష్ట చర్యలు..

- ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్
- రోడ్డు భద్రత కమిటీ సమావేశం..

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. జిల్లా రోడ్డు భద్రత సమావేశాన్ని జిల్లా సమీక ృత కార్యాలయాల సముదాయంలో ఆయా శాఖల అధికారులతో శుక్రవారం నిర్వహించారు. ముందుగా జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ప్రమాదాలు అధికంగా జరగడానికి గల కారణాలను ఇంచార్జి కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు.



ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో అధికంగా రోడ్డు ప్రమాదాలు జరిగే బ్లాక్ స్పాట్లను ఆర్ అండ్ బీ, ఎన్ హెచ్, పోలీస్, ట్రాన్స్పోర్ట్ అధికారులు సంయుక్తంగా సర్వే చేయాలని ఆదేశించారు. ప్రమాదాలకు కారణమవుతున్న యూటర్న్ లను మూసి వేయాలని, రోడ్డుపై అధిక వేగంతో ప్రయాణించే వాహనాలను చెక్ చేసేందుకు స్పీడ్ గన్స్ కొనుగోలు చేయాలన్నారు. జిల్లాలో రోడ్డుకు సమీపంలో ఉన్న పాత బావుల పూడ్చివేత, రోడ్డుకు ఇరువైపులా పెరిగిన చెట్ల కొమ్మలు తొలగించే పనులు చేపట్టి పూర్తి చేయాలని సూచించారు. రోడ్ల వెంబడి ప్రమాదాల నివారణకు ప్రస్తుతం రేడియం స్టిక్కర్లు, సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రమాదాలు అధికంగా జరుగుతున్న ప్రాంతాల్లో రేడియం సైన్ బోర్డు ఏర్పాటు చేయాలని ఇంచార్జి కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్టీఏ నాన్ అఫీషియల్ మెంబర్ సంగీతం శ్రీనాథ్, ఈఈ ఆర్ అండ్ బీ నరసింహాచారి, జిల్లా రవాణా అధికారి లక్ష్మణ్, డిపిఓ షరీపుద్దీన్, ఈఈ పీఆర్ సుదర్శన్ రెడ్డి, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రవీణ్, మున్సిపల్ కమిషనర్లు ఖదీర్ పాషా, అన్వేష్, పోలీసు ఎక్సైజ్ అధికారులు, సంబంధిత సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# పల్లె దవాఖానలో ఆకస్మిక తనిఖీ చేసిన ఇంచార్జి కలెక్టర్

- రోగులతో మాట్లాడి.. వైద్య సేవలపై ఆరా..

**బలగం టీవీ, ఇల్లంతకుంట**

ఇల్లంతకుంట మండల కేంద్రంలోని పల్లె దవాఖానలో ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా వైద్యులు, సిబ్బంది హాజరు రిజిస్టర్, ఓపీ రిజిస్టర్, మందులు ఇచ్చే గది, వ్యాక్సిన్లు, మందుల స్టోర్ రూంలో పరిశీలించారు. ఆసుపత్రి ఆవరణ మొత్తం శుభ్రంగా ఉండాలని ఆదేశించారు. వైద్యానికి వచ్చిన పలువురు రోగులతో మాట్లాడి సేవలపై ఆరా తీశారు. డాక్టర్, సిబ్బంది అందుబాటులో ఉంటూ.. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు.



# అయ్యప్ప స్వామి అరట్టు మహోత్సవంలో పాల్గొన్న రాష్ట్ర ప్రభుత్వ విప్.

**బలగం టీవీ, వేములవాడ:**

వేములవాడ పట్టణంలోని తిప్పాపూర్ లోగల అయ్యప్ప స్వామి ఆలయంలో నిర్వహించిన స్వామి వారి ఆరట్టు ఉత్సవంలో రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు. స్వామి వారిని దర్శించుకొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అయ్యప్ప ఆశీస్సులతో ప్రజలంతా సంతోషంగా ఉండాలని వేడుకొన్నారు.




# ఎన్నికల డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని పరిశీలించిన అదనపు కలెక్టర్

**బలగం టీవీ, తంగళ్ళపల్లి**

గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో రెండో ఫేజ్ ఎన్నికలు నిర్వహించనున్న సందర్భంగా తంగళ్ళపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారులు, సిబ్బందికి సూచనలు చేశారు. ఎస్ఈసీ నిబంధనల మేరకు విధులు నిర్వర్తించాలని సూచించారు. ఆయా గ్రామాలకు కేటాయించిన వాహనాల్లో అధికారులు, సిబ్బంది సామగ్రితో తరలి వెళ్లారు. ఈ కార్యక్రమంలో సీపీఓ శ్రీనివాసాచారి, డీపీఓ షరీపుద్దిన్, ఎంపీడీఓ లక్ష్మీనారాయణ, సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా తదితరులు పాల్గొన్నారు.

# వేములవాడ అయ్యప్ప ఆలయంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుల ప్రత్యేక పూజలు

**బలగం టీవీ, వేములవాడ**



వేములవాడ అయ్యప్ప స్వామి దేవాలయంలో ఆరట్టు పూజా మహోత్సవం సందర్భంగా బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు కొండ దేవయ్య, మాజీ ఎంపీటీసీ ఐలవేని రాజేందర్, మాజీ కౌన్సిలర్లు నిమ్మశెట్టి విజయ్, నరాల శేఖర్, మారం కుమార్, గోలి మహేష్, కొండ నర్సయ్య, కనకయ్య, నీలం శేఖర్ తదితరులు స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణంలో జరిగిన ఈ పూజా కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.




## సారంపల్లిలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన ఇంచార్జి కలెక్టర్

**బలగం టీవీ, తంగళ్ళపల్లి**

గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో రెండో ఫేజ్ ఎన్నికలు నిర్వహించనున్న సందర్భంగా తంగళ్ళపల్లి మండలంలోని సారంపల్లి గ్రామ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రంలో ఓటు వేసేందుకు చేసిన ఏర్పాట్లను సందర్శించారు. పోలింగ్ కేంద్రం పరిధిలో ఎందరు ఓటర్లు ఉన్నారో అడిగి తెలుసుకున్నారు. వృద్ధులు, దివ్యాంగులకు కోసం సిద్ధం చేసిన వీల్ చైర్, ఇతర సౌకర్యాలు పరిశీలించారు. ఓటింగ్, పూర్తి అయిన తర్వాత చేపట్టాల్సిన చర్యలపై అధికారులకు సూచనలు చేశారు. ఈ పరిశీలనలో సీపీఓ శ్రీనివాసాచారి, తహసీల్దార్ జయంత్, ఎంపీడీఓ లక్ష్మీనారాయణ, ఎంపీఓ, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## హత్యాయత్నం కేసులో నలుగురిపై కేసు నమోదు

- **ఒకరి అరెస్ట్, రిమాండ్ కి తరలింపు..**
- **వివరాలు వెల్లడించిన జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే**

**బలగం టీవీ, వేములవాడ**



నాగయ్యపల్లి గ్రామ సర్పంచ్ పదవికి జరిగిన ఎలక్షన్ లో చింతపంటి మల్లేశం సర్పంచ్ గా గెలవగా సమీప అభ్యర్థి గోపు మధు మరియు అతని భార్య గోపు మాలతి కూడా వార్డ్ మెంబర్ గా ఓడిపోగా ఇట్టి ఓటమికి నాగయ్యపల్లి గ్రామానికి చెందిన రొండి రాజు మార్కెట్ కమిటీ చైర్మన్ అనే వ్యక్తి కారణమని కక్ష పెంచుకుని అతని ఎలాగైనా అంతమొందించాలని తన గ్రామ అనుచరులైన గుంటి శివ, గుంటి నగేష్ అనే వారి సహాయంతో శుక్రవారం అర్ధరాత్రి రెండు గంటల సమయంలో రొండి రాజు మరో ఇద్దరు వ్యక్తులతో కలిసి తన కారులో వేములవాడకు తన గ్రామం నుండి వెళ్తుండగా మార్గమధ్యంలో గుంటి శివ, గుంటి నగేష్ అనే వారు కారును అడ్డగించి రొండి రాజు చంపడానికి ప్రయత్నించినారు. ఇట్టి ఘటనలో రొండి రాజు తలకు తీవ్ర గాయాలు కాగా రొండి రాజు యొక్క ఫిర్యాదు చేయగా వేములవాడ రూరల్ పోలీస్ స్టేషన్ నందు గోపు మధు, గోపు మాలతి, గుంటి శివ,గుంటి నగేష్ లపై హత్యాయత్నం, ఎస్సీ ఎస్టీ చట్టం కింద కేసులు నమోదు చేసి దర్యాప్తులో భాగంగా శుక్రవారం గోపు మదును అరెస్టు చేసి రిమాండ్ కు తరలించనైనదని ఎస్పీ తెలిపారు. డిఎస్పీ ఆధ్వర్యంలో రెండు స్పెషల్ టీమ్ లు ఏర్పాటు చేసి పరారీలో ఉన్న నిందుతులను త్వరలో పట్టుకోవడం జరుగుతుందని ఎస్పీ తెలిపారు.

## ఎన్నికల నేపథ్యంలో తంగళ్ళపల్లిలో ఎస్సై ఉపేంద్ర చారి హెచ్చరికలు..

**బలగం టీవీ, తంగళ్ళపల్లి**



తంగళ్ళపల్లి మండలంలో జరగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా, శాంతి భద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా ఉండేందుకు స్థానిక ఎస్సై ఉపేంద్ర చారి కఠిన హెచ్చరికలు జారీ చేశారు. ఎన్నికల నిబంధనలను కచ్చితంగా పాటించాలని ప్రజలకు ఒక ప్రకటన ద్వారా ఆయన విజ్ఞప్తి చేశారు. ఎన్నికల దృష్ట్యా, తేదీ 12-12-2025 సాయంత్రం 05:00 గంటల నుండి తేదీ 13-12-2025 సాయంత్రం 05:00 గంటల వరకు తంగళ్ళపల్లి మండలంలో కొత్త వ్యక్తులు లేదా వేరే గ్రామాలకు చెందిన వారు ఎట్టి పరిస్థితుల్లోనూ ఉండకూడదు. ఈ నిబంధనను ఉల్లంఘిస్తూ కొత్త వ్యక్తులు ఎవరైనా తమ దృష్టికి వస్తే, వారిపై కఠిన చర్యలు తీసుకోబడునని ఎస్సై హెచ్చరించారు.ఎన్నికల నిబంధనల ప్రకారం, శుక్రవారం (12-12-2025) సాయంత్రం 05:00 గంటల నుండి ఎలాంటి ప్రచారం చేయకూడదు. అభ్యర్థులు లేదా అనుచరులు గుంపులు గుంపులుగా తిరగకూడదు. అలాగే, ముగ్గురు లేదా నలుగురు కంటే ఎక్కువ మంది కలిసి ప్రచారం చేయకూడదు. ఈ నిబంధనలను ఎవరైనా ఉల్లంఘించినట్లయితే, వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకొని, కేసులు నమోదు చేయబడునని ఎస్సై ఉపేంద్ర చారి స్పష్టం చేశారు. ఎస్సై ఉపేంద్ర చారి ప్రజలందరూ పోలీసు శాఖకు సహకరించి, ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు తోడ్పడాలని కోరారు.

## ఎంపీడీఓ కార్యాలయంలో తనిఖీ చేసిన జిల్లా వ్యయ పరిశీలకులు..

**బలగం టీవీ, ముస్తాబాద్:**



గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా ఎంపీడీఓ కార్యాలయంలో జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకులు రాజ్ కుమార్ శనివారం తనిఖీ చేశారు. ముస్తాబాద్ ఎంపీడీఓ కార్యాలయంలో పరిశీలించారు. అక్కడ అధికారులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎంపీడీఓ, ఎంపీఓ, సహాయ వ్యయ పరిశీలకులతో సమావేశమయ్యారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ తదితరులు పాల్గొన్నారు.

# జీపీ రెండో ఫేజ్ ఎన్నికలకు సర్వం సిద్ధం..


- **ఇల్లంతకుంట, బోయినపల్లి, తంగళ్ళపల్లి మండలాల్లోని 77 జీపీలు, 530 వార్డుల్లో ఎన్నికలు**
- **18 రకాల గుర్తింపు కార్డులతో ఓటు హక్కు వినియోగించుకోవచ్చు**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో రెండో ఫేజ్ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి అవుతున్నాయి. ఈ నెల 14 వ తేదీన ఆదివారం 77 గ్రామ పంచాయతీలు, 530 వార్డుల్లో ఎన్నికలు నిర్వహించేందుకు యంత్రాంగం సన్నద్ధమైంది.

**మొత్తం ఓటర్లు 1,11,130 మంది**

గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని బోయినపల్లి, ఇల్లంతకుంట, తంగళ్ళ పల్లి మండలాల్లో రెండో ఫేజ్ ఎన్నికలు నిర్వహించనున్నారు. బోయినపల్లి మండలంలో 14,753 మంది పురుషులు, 15,752 మహిళలు మొత్తం 30,505, ఇల్లంతకుంట మండలంలో 19,644 మంది పురుషులు, 20,902 మహిళలు మొత్తం 40,546, తంగళ్ళపల్లి మండలంలో 19,395 మంది పురుషులు 20,683 మహిళలు, ఇతరులు ఒకరు మొత్తం 40,079 ఓటర్లు ఉన్నారు. మొత్తం ఓటర్లు 1,11,130 మంది ఉన్నారు.



**మొత్తం పోలింగ్ కేంద్రాలు**

బోయినపల్లి, ఇల్లంతకుంట, తంగళ్ళపల్లి మండలాల్లో మొత్తం గ్రామ పంచాయతీలు 88, వార్డు స్థానాలు 758 ఉండగా, 11 సర్పంచ్ స్థానాలు, 228 వార్డు స్థానాలు ఏకగ్రీవం అయ్యాయి. ఈ నెల 14 వ తేదీన ఆదివారం 77 గ్రామ పంచాయతీల్లో సర్పంచ్ స్థానాలకు, 530 వార్డుల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు. సర్పంచ్ స్థానాలకు అభ్యర్థులు 279, వార్డు స్థానాలకు అభ్యర్థులు 1,296 మంది పోటీలో ఉన్నారు.

**ప్రణాళిక సిద్ధం**

ఎన్నికలకు మూడు మండలాల్లో కలిపి మొత్తం ప్రిసైడింగ్ అధికారులు 910, అదర్ పోలింగ్ అధికారులు 1093 మంది విధులు నిర్వర్తించనున్నారు. ఎన్నికల సామగ్రి, అధికారులు, సిబ్బందిని తరలించేదుకు బోయినపల్లి మండలంలో మొత్తం జోన్స్ 4, రూట్స్ 8, ఇల్లంతకుంట మండలంలో జోన్స్ 5, రూట్స్ 8, తంగళ్ళపల్లి మండలంలో జోన్స్ 5, రూట్స్ 10 గా ప్రణాళిక సిద్ధం చేశారు. మూడు మండలాల్లో కలిపి మొత్తం 530 పోలింగ్ కేంద్రాలు సిద్ధం చేశారు.

ఓటు హక్కు వినియోగించుకోవడానికి ఓటరు జాబితాలో పేరుండి %ా% ఓటరు గుర్తింపు కార్డు (ఎపిక్ కార్డు) కాకుండా ఈ కింద చూపిన 18 ప్రత్యామ్నాయ ఫొటో ఐడీలలో దేనినైనా ఒకటి పోలింగ్ సిబ్బందికి చూపి తమ ఓటు హక్కును వినియోగించుకోవచ్చు.

ఆధార్, భారతీయ పాస్ పోర్ట్, డ్రైవింగ్ లైసెన్స్, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు, పీఎస్‌యూలు, పబ్లిక్ లిమిటెడ్ కంపెనీలు జారీ చేసిన ఉద్యోగ గుర్తింపు కార్డులు, బ్యాంకు, తపాలా కార్యాలయం జారీ చేసిన ఫొటోతో కూడిన పాస్ బుక్, పాన్ కార్డు, నేషనల్ పాపులేషన్ రిజిస్టర్(ఎన్‌పిఐ) కింద రిజిస్ట్రార్ జనరల్ అండ్ సెన్సెస్ కమిషనర్ ఇండియా(%క్ష్మ+క్ష్మీ%) జారీ చేసిన స్మార్ట్ కార్డు, శాసనసభ, శాసనమండలి జారీ చేసిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ అధికారిక గుర్తింపు కార్డులు, ఫొటోతో కూడిన స్వాతంత్ర్య సమరయోధుల గుర్తింపు కార్డు, లోక్ సభ, రాజ్యసభ జారీ చేసిన ఎంపీ గుర్తింపు కార్డు, ఎన్నికల నోటిఫికేషన్ కంటే ముందు జారీ చేసిన ఫొటోలతో కూడిన ఉపాధి హామీ జాబ్ కార్డు, కేంద్ర కార్మికశాఖ జారీచేసిన ఆరోగ్య బీమా స్మార్ట్ కార్డ్, రేషన్ కార్డు, ఎస్సీ, ఎస్టీ, బీసీ ధ్రువపత్రాలు, పెన్షన్ పత్రాలు, ఆయుధాల లైసెన్స్, దివ్యాంగ ధృవీకరణ పత్రం, పట్టాదారు పాస్ బుక్.

### రెండో విడత గ్రామపంచాయతీ ఎన్నికలకు

# 700 మంది పోలీస్ సిబ్బందితో పటిష్ట బందోబస్తు..

- **ప్రజలు ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కును వినియోగించుకోవాలి.**
- **పోలింగ్, కౌంటింగ్ పూర్తి అయ్యేవరకు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి..**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**



ప్రశాంత వాతావరణంలో, పారదర్శకంగా రెండవ విడత గ్రామపంచాయతీ ఎన్నికలు నిర్వహించేందుకు పోలీస్ శాఖ పరంగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు. తంగళ్ళపల్లి పోలీస్ స్టేషన్లలో ఎన్నికల విధులు నిర్వహిస్తున్న పోలీస్ అధికారులు, సిబ్బందికి జిల్లా ఎస్పీ ఎన్నికల విధులకు సంబంధించి దిశానిర్దేశం చేశారు. ఎస్పీ మహేష్ బి. గితే మాట్లాడుతూ.. ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా రెండవ విడత గ్రామపంచాయతీ ఎన్నికలు నిర్వహించేందుకు పోలీస్ శాఖ పరంగా అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని తెలిపారు. రెండవ విడత ఎన్నికల నిర్వహణకు రూట్ మొబైల్స్: 26, జోనల్ టీమ్స్: 07 (ఇన్స్పెక్టర్ స్థాయి అధికారితో), క్విక్ రియాక్షన్ టీమ్స్: 03, స్ట్రయికింగ్ ఫోర్స్: 02 ఏర్పాటు చేసి మొత్తం 700 మంది పోలీస్ సిబ్బందిని వినియోగిస్తున్నామన్నారు.

పోలింగ్ కేంద్రాల వద్ద విధులు నిర్వహించే సిబ్బంది పోలింగ్ సమయంలో, కౌంటింగ్ సమయంలో అప్రమత్తంగా ఉంటూ ఎట్టి పరిస్థితుల్లోనూ పోలింగ్ కేంద్రాలను వదిలి వెళ్లరాదని సూచించారు.రూట్ మొబైల్ అధికారులు తమకు కేటాయించిన రూట్లలో నిరంతరం పెట్రోలింగ్ నిర్వహించాలని ఆదేశించారు.పోలింగ్ కేంద్రాల వద్ద లేదా రూట్లలో ఎన్నికల ప్రశాంత వాతావరణానికి భంగం కలిగించే చిన్న సంఘటన ఎదురైన వెంటనే సంబంధిత ఉన్నతాధికారులకు సమాచారం అందించాలని సూచించారు. ఎన్నికల కమిషన్ ఆదేశించిన ఎన్నికల నియమావళిని ప్రజలు పాటిస్తూ,పోలీసులకు సహకరించి స్వేచ్ఛాయుత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎస్పీ కోరారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘనలకు సంబంధించి ఇప్పటివరకు జిల్లాలో 9 కేసులు నమోదు, రూ. 23,28,500/- నగదు సీజ్, అక్రమ మద్యంపై ప్రత్యేక దృష్టి సారించి నిర్వహించిన దాడుల్లో 93 కేసుల్లో 1387 లీటర్ల మద్యం సీజ్, 224 కేసుల్లో 782 మందిని బైండోవర్ చేయడం జరిగిందని తెలిపారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు ఎవరైనా పాల్పడితే, ఎన్నికల నియమావళి ప్రకారం చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎస్పీ వెంట అదనపు ఎస్పీ చంద్రయ్య, సి.ఐ లు, ఎస్.ఐ సిబ్బంది ఉన్నారు.

## పార్లమెంట్ ప్రాంగణంలో స్టాండింగ్ కమిటీ మీటింగ్‌కు హాజరైన ఎంపీ



- **పెట్రోలియం స్థాయీ సంఘం సమావేశంలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర..**
- **ఇంధన ధరలు, వినియోగదారుల సేవల్లో నాణ్యతపై కీలక**

**బలగం టీవీ, న్యూఢిల్లీ:**

బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర పెట్రోలియం, సహజవాయువు శాఖకు సంబంధించిన పార్లమెంటరీ స్థాయీ సంఘం సమావేశంలో పాల్గొన్నారు. గురువారం సాయంత్రం పార్లమెంట్ కమిటీ హాలులో ఈ స్థాయీ సంఘం సమావేశమైంది. ఎంపీ రవిచంద్ర ఈ సందర్భంగా జరిగిన విస్తృత చర్చలో చురుగ్గా పాల్గొని, ఇంధన రంగానికి సంబంధించి అనేక కీలక అంశాలపై తన అభిప్రాయాలను, సలహాలను అందించారు.

పెట్రోలియం, సహజవాయువు ఉత్పత్తుల లభ్యత మరియు వినియోగ విధానాలు. అంతర్జాతీయ మార్కెట్‌లో ఇంధన ధరల హెచ్చుతగ్గులు, దేశీయ ధరలపై వాటి ప్రభావం. వినియోగదారులకు అందుతున్న సేవలు, వాటి భద్రత, మరియు తక్షణావసరాలు. ఇంధన ఉత్పత్తులలో పాటించవలసిన నాణ్యతా ప్రమాణాలు. ప్రజలకు మరింత మెరుగైన, నాణ్యమైన సేవలను అందించడానికి ప్రభుత్వం తీసుకోవలసిన చర్యలు. ఈ అంశాలపై జరిగిన చర్చలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర పాల్గొని, ఇంధన రంగంలో ప్రస్తుత పరిస్థితులు మరియు భవిష్యత్తు కార్యాచరణ గురించి పలు సలహాలు, సూచనలు చేశారు.

# ధర్మశాలలో గెలిచేదెవరో...?

- నేడు దక్షిణాఫ్రికాతో మూడో టీ20
- ధర్మశాలలో రాత్రి 7 గంటలకు మ్యాచ్
- దూబే స్థానంలో సంజు..?

బలగం టీవీ, ధర్మశాల



ఐదు టీ20ల సిరీస్‌లో భాగంగా భారత్–దక్షిణాఫ్రికా జట్ల మధ్య మూడో టీ20 మ్యాచ్ ఆదివారం ధర్మశాల వేదికగా జరగనుంది. తొలి రెండు టీ20ల్లో ఇరుజట్లు ఒక్కో మ్యాచ్ గెలుచుకోవడంతో సిరీస్ 1–1తో సమంగా ఉంది. ఈ క్రమంలో మూడో టీ20లో విజయం సాధించిన జట్టు సిరీస్‌లో ఆధిక్యం సాధించనుంది. మ్యాచ్ రాత్రి 7 గంటలకు ప్రారంభం కానుంది.

వచ్చే ఏడాది ప్రారంభంలో టీ20 ప్రపంచకప్ ఉండటంతో పటిష్ట జట్టును సిద్ధం చేసుకోవాల్సిన అవసరం టీమిండియాకు ఉంది. అయితే ఓపెనర్ శుభ్‌మన్ గిల్, కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ బ్యాటింగ్‌లో విఫలమవుతుండటంతో అభిమానుల్లో ఆందోళన నెలకొంది.

హిమాచల్‌ప్రదేశ్‌లోని ధర్మశాల మైదానంలో రాత్రిపూట మంచు ప్రభావం ఉండే అవకాశముంది. దాదాపు 1,500 మీటర్ల ఎత్తులో ఉన్న హిమాచల్‌ప్రదేశ్ క్రికెట్ అసోసియేషన్ స్టేడియంలిలిలో ఛేదనకు దిగే జట్టుకు పరుగులు రాబట్టడం సవాలుగా మారే సూచనలు ఉన్నాయి.

**అందరి దృష్టి గిల్, సూర్యకుమార్‌పైనే**

టీ20 ఫార్మాట్‌లో శుభ్‌మన్ గిల్ స్థానం ప్రమాదంలో పడింది. గత రెండు మ్యాచ్‌ల్లో అతడు చేసిన పరుగులు 4 మాత్రమే. ఇక కెప్టెన్ సూర్యకుమార్ కూడా ఆశించిన స్థాయిలో రాణించలేకపోతున్నాడు. అయితే అతడి నాయకత్వంలో ఆడిన ఆరు సిరీస్‌ల్లో భారత్ ఒక్కదాన్నీ కోల్పోలేదని మాజీ క్రికెటర్, విశ్లేషకుడు ఆకాశ్ చోప్రా వ్యాఖ్యానించారు. దక్షిణాఫ్రికాతో జరిగిన రెండు టీ20ల్లో సూర్యకుమార్ 17 పరుగులకే పరిమితమయ్యాడు.మరోవైపు ఆల్‌రౌండర్ శివమ్ దూబే కూడా నిరాశపరిచాడు. దీంతో బ్యాటింగ్ బలపరిచేందుకు అతడి స్థానంలో లిలిసంజు శాంసన్‌లిలిను రెగ్యులర్ బ్యాటర్‌గా తుది జట్టులోకి తీసుకునే అవకాశముందని సమాచారం.

# కోల్‌కతా మెస్సీ పర్యటనలో ఉద్రిక్తత



(మొదటి పేజీ తరువాయి)

సుమారు 70--80 మంది ప్రముఖులు ఆయన చుట్టూ గుమిగూడారు. ఈవెంట్ నిర్వాహకులు, రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి అరూప్ బిశ్వాస్, పలు ఫుట్‌బాల్ క్లబ్‌ల ప్రతినిధులు సెల్ఫీలు, ఆటోగ్రాఫ్‌లలో నిమగ్నమయ్యారు. ఫలితంగా గ్యాలరీల్లో ఉన్న అభిమానులు మెస్సీని చూడలేకపోయారు. 'వి వాంట్ మెస్సీ' అంటూ నినాదాలు కూడా వినిపించాయి. పరిస్థితి చేజారుతుందనే ఆందోళనతో ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, బాలీవుడ్ నటుడు షారుఖ్ ఖాన్ స్టేడియానికి చేరకముందే 11.52 గంటల సమయంలో మెస్సీని బయటకు తీసుకెళ్లారు.

దీంతో అభిమానుల ఆగ్రహం కట్టలు తెంచుకుంది. గ్యాలరీ కుర్చీలు లాగి స్టేడియంలోకి విసిరివేయడం, మంచినీటి సీసాలు విసరడం, ఫెన్సింగ్ గేట్లు ధ్వంసం చేయడం జరిగింది. వందలాదిమంది స్టేడియాన్ని తమ అధీనంలోకి తీసుకుని తాత్కాలిక నిర్మాణాలను ధ్వంసం చేశారు. కొన్ని చోట్ల నిప్పు పెట్టినట్లు సమాచారం. పోలీసులు అదుపు చేయడానికి ప్రయత్నించినా కొద్దిసేపు తీవ్ర గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. స్టేడియం వెలుపల కూడా నిర్వాహకులపై నినాదాలు చేశారు.

**మమత క్షమాపణ**

ఈ ఘటనపై ముఖ్యమంత్రి మమతా బెనర్జీ క్షమాపణ చెప్పారు. తక్షణ విచారణకు ఆదేశించినట్లు తెలిపారు. సాల్ట్ లేక్ స్టేడియంలో నిర్వహణా లోపాలు తనను దిగ్భ్రాంతికి గురి చేశాయని పేర్కొన్నారు. క్రీడాభిమానులు, ప్రజలకు, అలాగే మెస్సీకి క్షమాపణలు తెలిపారు. తాను కూడా స్టేడియానికి బయలుదేరిన సమయంలోనే ఈ ఘటన చోటుచేసుకుందని ఆమె 'ఎక్స్' పోస్టులో వెల్లడించారు. జస్టిస్ (రిటైర్డ్) అసిం కుమార్ రే నేత ృత్వంలో విచారణ కమిటీ ఏర్పాటు చేసినట్లు ముఖ్యమంత్రి తెలిపారు. హోం వ్యవహారాల చీఫ్ సెక్రటరీ, అదనపు చీఫ్ సెక్రటరీలు సభ్యులుగా ఉంటారని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావ ృతం కాకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

**అదుపులోకి నిర్వాహకులు**

ఈ కార్యక్రమ ప్రధాన నిర్వాహకుడిని అదుపులోకి తీసుకున్నట్లు బెంగాల్ డీజీపీ రాజీవ్ కుమార్ తెలిపారు. టిక్కెట్లు కొనుగోలు చేసి నష్టపోయిన అభిమానులకు తగిన పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ ఘటనలో ఎక్కడా ప్రాణనష్టం లేదా గాయాలు జరగలేదని స్పష్టం చేశారు.

# ఇది విజన్ 2047 కాదు.. విద్యార్థుల పాలిట పాయిజన్ 2047..

(మొదటి పేజీ తరువాయి)

కొట్టుకుంటున్న 'విజన్ 2047' విద్యార్థుల పాలిట 'పాయిజన్ 2047' గా మారిందని అన్నారు. టీవీ, పేపర్ యాడ్లలో మాత్రమే తెలంగాణ రైసింగ్ అని చెబుతున్నారని, వాస్తవంలో గురుకుల, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు కలుషిత ఆహారంతో హాస్పిటల్స్ లో ఫాలింగ్ అవుతున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో ప్రతిరోజూ ఏదో ఒక గురుకులంలో విద్యార్థులు కలుషిత ఆహారం తిని ఆసుపత్రి పాలవుతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. మొన్న షామీర్ పేటలో అన్నంలో పురుగులు వస్తున్నాయని ఏకంగా విద్యార్థులే పోలీస్ స్టేషన్ కి వెళ్లి రేవంత్ ప్రభుత్వంపై ఫిర్యాదు చేశారని గుర్తుచేశారు. నిన్న మాదాపూర్‌లోని చందు నాయక్ తండాలో 43 మంది, తాజాగా బాగ్ లింగంపల్లిలో 90 మంది విద్యార్థులు

అస్వస్థతకు గురయ్యారని తెలిపారు. నీకు నిజాయితీ ఉంటే గురుకులాల్లోని పిల్లలకు కడుపునిండా అన్నం పెట్టు అని అన్నారు. ఆసుపత్రిలో చేరిన విద్యార్థులు తిరిగి హాస్టల్‌కు వెళ్లమంటే భయపడుతున్నారని చెప్పారు, ప్రభుత్వ హాస్టళ్లలో పిల్లలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని బతుకుతున్నారని అన్నారు.

కనీసం ముఖ్యమంత్రికి చీమ కుట్టినట్టైనా లేదని, ఏనాడు ఆసుపత్రి పాలైన విద్యార్థులను పరామర్శించలేదని విమర్శించారు. ఒక పక్క పిల్లలకు కడుపునిండా అన్నం పెట్టడానికి డబ్బుల్లేవు కానీ, మెస్సీతో ఫుట్‌బాల్ ఆడేందుకు రూ. 5 కోట్లతో స్టేడియం, రూ. 100 కోట్లు ఖర్చు చేస్తున్నారని రేవంత్ రెడ్డిపై మండిపడ్డారు. "ఆ డబ్బుతో విద్యార్థులకు ఒక పూట కడుపునిండా అన్నం పెట్టలేవా?" అని ప్రశ్నించారు. కేసీఆర్ హయాంలో సన్నబియ్యంతో మంచి నాణ్యమైన ఆహారం అందేదని, కానీ ఇప్పుడు దొడ్డు బియ్యం పెడుతున్నారని, అన్నం ఉడకడం లేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని హరీష్ రావు తెలిపారు.

42% రిజర్వేషన్ కోసం బీసీలు పోరాటం చేస్తున్నా రాడు, రాష్ట్రంలో ఎన్ని సమస్యలు ఉన్నా ముఖం చాటేసి, ఈరోజు ఫుట్ బాల్ చూడడానికి వస్తున్నాడని అన్నారు. రాష్ట్రంలో సమస్యలున్నా ముఖం చాటేసిన రాహుల్ గాంధీ, ఫుట్‌బాల్ చూడడానికి ప్రత్యేక విమానంలో వస్తున్నారని హరీష్ రావు విమర్శించారు. 61 సార్లు ఢిల్లీకి పోవడానికి టైం ఉంది కానీ ఆసుపత్రి పాలయిన విద్యార్థులను పరామర్శించడానికి టైం లేదా అని, ఆరు గ్యారెంటీలకు నాది జిమ్మేదారి అన్న రాహుల్ గాంధీ, రాష్ట్రంలో దాదాపు 300 మంది రైతులు, 160 మంది ఆటో డ్రైవర్లు, 116 మంది విద్యార్థులు చనిపోయినా ఎందుకు రాలేదని ప్రశ్నించారు.

కలుషిత ఆహారంతో కడుపునొప్పి భరించలేక ఏడుస్తున్న విద్యార్థుల కన్నీళ్లు చూడవా రాహుల్ గాంధీ? అని ప్రశ్నిస్తూ, "గురుకుల పాఠశాలలో పురుగుల అన్నం తిని ఆగమైతుంటే, నీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని అడిగే తెలివి, బాధ్యత లేదా?" అని నిలదీశారు. విద్యాశాఖ మంత్రిగా, ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి అట్టర్ ఫ్లాఫ్ అయ్యాడని, త్రీ ట్రిలియన్ ఎకానమీ, ఫ్యూచర్ సిటీ అని గొప్పలు చెప్పడం కాదని ముందు హాస్టల్ పిల్లలకు పురుగులు లేని అన్నం పెట్టండని హరీష్? రావు హెచ్చారించారు.

# హైదరాబాద్‌లో మెస్సీ మేనియా

(మొదటి పేజీ తరువాయి)

ప్రేక్షకులకు ఫుట్‌బాళ్లను బహూకరించారు. మెస్సీతో పాటు రొడ్రిగో, సువారెజ్‌లు సైతం అభిమానులను అలరించారు. వారు స్టేడియంలో అన్ని వైపుల తిరుగుతూ ఫుట్‌బాల్ టీమ్‌లకు చెందిన పిల్లలతో బ ృందాల వారిగా రౌండప్ చేసి ఆడుతూ జోష్ నింపారు.

14 సంవత్సరాల తర్వాత భారత్‌లో అడుగు పెట్టిన ఈ అర్జెంటీనా కెప్టెన్ లియోనెల్ మెస్సీ క్రీడాభిమానులను మెప్పిం చారు. మెస్సీ హైదరాబాద్ పర్యటన అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో విజయవంతంగా సాగింది. మెస్సీతో పాటు హైదరాబాద్‌కు చేరుకున్న ఫుట్‌బాల్ క్రీడాకారులు రోడ్రిగో డిపాల్ (అర్జెంటీనా), లూయిస్ సువారెజ్ (ఉరుగ్వే) లు, రేవంత్ రెడ్డి గార్లు మైదానంలోకి దిగిన సందర్భంలో మెస్సీ.. మెస్సీ.. అంటూ స్టేడియం దద్దరిల్లింది. చివరగా మెస్సీ పిల్లల టీముల వారిగా విడివిడిగా ఫోటోలు దిగారు. మెస్సీ చేతుల మీదుగా ఆర్ఆర్ 9 టీమ్ గోట్ కప్‌ను స్వీకరించింది. అలాగే అపర్ణ ఆల్ స్టార్స్ టీమ్ రన్నరప్ కప్ అందజేశారు. అర్జెంటీనా టీమ్ 10వ నంబర్ జెర్సీని మెస్సీ స్వయంగా రేవంత్ రెడ్డి గారికి, రాహుల్ గాంధీ గారికి అందజేశారు. ఉప్పల్ స్టేడియంలో మ్యాచ్‌కు ముందు మ్యూజిక్ కన్సర్ట్, అద్భుతమైన లేజర్ షోతో కార్యక్రమం ప్రారంభమైంది. ప్రముఖ గాయకుడు రాహుల్ సిప్లిగంజ్ నాటు నాటు... పాటతో అభిమానులను అలరించారు. గాయకురాలు మంగ్లీ పాటలతో అభిమానుల్లో జోష్ నింపారు. ప్రతాప్ రాణా ప్రత్యేకంగా కంపోజ్ చేసిన పాటను లియోనెల్ మెస్సీ కోసం అంకితం చేశారు. భారత్ పర్యటన, అభిమానులు చూపిన ఆదరణ తనకెంతో ఆనందం కలిగించిందని మెస్సీ వ్యాఖ్యానించారు. తెలంగాణకు స్వాగతం, తెలంగాణ ఈజ్ రైజింగ్.. కమ్ జాయిన్ ద రైజ్... అంటూ ముఖ్యమంత్రి మెస్సీ బృందాన్ని ఉద్దేశించి మాట్లాడారు. క్రీడాభిమానులకు మెస్సీ బృందం అభివాదంతో కార్యక్రమం ముగిసింది.

# పార్లమెంటుపై దాడిలో మృతులకు నివాళులు

(మొదటి పేజీ తరువాయి)

భద్రతా సిబ్బంది ప్రాణాలను బలిగొన్న ఈ దాడిని ప్రజాస్వామ్య దేవాలయంపై జరిగిన దాడిగా అభివర్ణించారు. పార్టీలకతీతంగా ప్రభుత్వ, ప్రతిపక్ష నాయకులు ఈ సంస్మరణ సభలో పాల్గొని నివాళులర్పించారు. భారత ప్రధాని మోడీ ప్రాణ త్యాగం చేసిన వారిని దేశం గుర్తుంచుకుంటుందన్నారు. వారి ధైర్యం, అప్రమత్తత కర్తవ్య భావన అసాధారణమైనదని తెలిపారు. రాహూల్ గాంధీ ఘనంగా నివాళులు అర్పించారు. కాగా, 2001లో డిసెంబర్ 13న లష్కరే తోయిబా (ఎల్ఇటి), జైషే మహ్మద్ (జెఎం) ఉగ్రవాద సంస్థలకు చెందిన ఐదుగురు భారీ ఆయుధాలతో పార్లమెంట్ క్లాంప్లెక్స్‌లో చొరబడి విచక్షణారహితంగా జరిపిన కాల్పుల్లో 14 మంది మృతి చెందిన ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది..ప్రపంచ దేశాలు ఖండించాయి..

# నక్సలిజంతో ఎవరికీ ప్రయోజనం లేదు

(మొదటి పేజీ తరువాయి)

గత రెండేళ్లలో 2,000 మందికిపైగా మావోయిస్టులు లొంగిపోయారని వెల్లడించారు.ఈసారి బస్తర్ ఒలింపిక్స్‌లో 700 మందికిపైగా మాజీ మావోయిస్టులు పాల్గొన్నారని తెలిపారు. వారిలో ప్రతిభ కనబర్చినవారికి స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ ఇచ్చి జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీలకు సిద్ధం చేస్తామని చెప్పారు. 2036 కామన్వెల్త్ క్రీడలను దృష్టిలో పెట్టుకొని ఇప్పటి నుంచే శిక్షణ అందిస్తామని తెలిపారు. 2026 బస్తర్ ఒలింపిక్స్ నాటికి ఈ ప్రాంతం మావోయిజం నుంచి పూర్తిగా విముక్తి పొందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయి, రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ రమణ్ సింగ్, డిప్యూటీ సీఎంలు అరుణ్ సావ్, విజయ్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

# పోగు బంధంతో ఫోన్ బంధం..

(మొదటి పేజీ తరువాయి)

పదిమందికి తెలియజేయాలనే ఆలోచనతోనే ఈ క్యూఆర్ కోడ్ శాలువాను రూపొందించాను. సిరిసిల్ల ఎప్పుడూ కొత్త ఆవిష్కరణలకు అడ్డా అని నిరూపించడమే నా లక్ష్యం," అని తెలిపారు.ఈ అద్భుత ఆవిష్కరణను కేటీఆర్ ద్వారా కేసీఆర్ కి అందించాలనే తన కోరికను విజయ్ వ్యక్తం చేశారు. దీనికి స్పందించిన కేటీఆర్, తప్పకుండా ఈ శాలువాను కేసీఆర్ గారికి అందజేస్తానని హామీ ఇచ్చారు. నేతన్నలకు కేటీఆర్ ఎల్లప్పుడూ అండగా ఉంటూ ప్రోత్సహిస్తున్నారని, భవిష్యత్తులో మరిన్ని అద్భుతాలు సృష్టిస్తామని విజయ్ సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, పార్టీ జనరల్ సెక్రటరీ రావుల చంద్రశేఖర్ రెడ్డి, సీనియర్ నాయకులు జాన్సన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# హాస్టల్ డిప్యూటీ వార్డెన్, ప్రిన్సిపాల్, స్టాఫ్ నర్స్ సస్పెండ్

- మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి మొహమ్మద్ అజారుద్దీన్

బలగం టీవీ, హైదరాబాద్



హైదరాబాద్ బాగ్‌లింగంపల్లి మైనార్టీ గురుకుల స్కూల్ ఫుడ్ పాయిజన్ ఘటనలో హాస్టల్ డిప్యూటీ వార్డెన్, స్టాఫ్ నర్స్, ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేసినట్టు మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి మొహమ్మద్ అజారుద్దీన్ తెలిపారు. శనివారం కింగ్ కోఠి జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను ఆయన పరామర్శించి వారికి అందుతున్న వైద్య సేవలను ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సంతోష్‌బాబును అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో మంత్రి మాట్లాడుతూ.. పిల్లల ఆరోగ్య పరిస్థితి మెరుగవుతుందని, ఒకటి రెండు రోజుల్లో డిశ్చార్జ్ అవుతారని తెలిపారు. హాస్టల్‌కు ఫుడ్ మెటీరియల్ సప్లై చేసిన వారిపై కూడా చర్యలు తీసుకుంటామన్నారు. విద్యార్థుల అస్వస్థత విషయంలో రాజకీయాలు చేయడం సరికాదన్నారు. ఇలాంటి ఘటనలు పురావతం కాకుండా గట్టి చర్యలు తీసుకుంటామన్నారు. విద్యార్థులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులను ఆదేశించామని తెలిపారు. మంత్రి వెంట ఆస్పత్రి సూపరింటెండెంట్ వైద్యులు సంతోష్ బాబు, వైద్యులు సాధన, చిన్నపిల్లల వైద్యులు, గ్రేడ్ టు నర్సింగ్ సూపరింటెండెంట్ పద్మ, ఎల్‌టీ